# ఉత్తరాల ఉదంతం

**కన్నెకంటి ప్రభాకర శాస్త్రి**

ప్రియమైన శ్రీవారికి- మదరాసు,
6-2-56

మీ రాణి నమస్కరించి వ్రాయునది. మీరు పంపిన చీరె, ఉత్తరం రెండూ చేరినవి. మీఉత్తరం చదువుతుంటే మిమ్మల్ని చూచినట్లే ఉంది. నాకు యింటా పనిచేసే సత్తువ రాలేదు. పాప ఆరోగ్యంగా వున్నాడు. 'అదుగో నాన్న' అంటే ఆత్రంగా చూస్తాడు. కనీసం నాలుగు నెలలయినా ఉండాలంటుంది అమ్మ. మీరు హోటలు భోజనంతో ఎంత బాధపడుతున్నారో అని బెంగగా వుంది. అయినా ఏం చేస్తాం. ఈ ఉత్తరం చూచినవెంటనే ఒకసారివచ్చి చూచిపోరూ!

ఇట్లు—మీ
చరణదాసి—రాణి

* * *

ప్రియమైన రాణికి, నెల్లూరు
14 2-56.

నీ ఉత్తరం అందినది. నీవు ఆరోగ్యంగా ఉన్నందుకు సంతోషం...మన పాపను చూడాలని ఎంతో ఉబలాటంగా వుంది. నా ఆఫీసు పరిస్థితులు నీకు తెలుసుగదా! ఒక రోజు గాదు—ఒక క్షణమయినా తీరిక దొరకదు. కడుపుతీపికొద్దీ మీ వాళ్ళు ఉండమంటారు. నీవు యిక్కడి పరిస్థితులు గమనించకద్దూ...హోటలు భోజనం తిని సగమయ్యాను......నీవు వెళ్ళి రెండు నెలలయినా రెండేళ్ళయి నట్లుంది. పది రోజులలో రావలసింది. పాపకు నా ముద్దులు.

ఇట్లు—నీ మూర్తి.

* * *

శ్రీవారికి— మదరాసు,
28. 2-56.

రాణి హృదయపూర్వక వందనములు.

అమ్మకు మీ ఉత్తరం చూపించాను... ఆమె ఏది ఏమైనా నన్ను ఆరునెలలదాకా పంపనంది. శని ఆదివారాలలో రమ్మని వ్రాయమన్నది. అక్కడ నీళ్ళకి వాటికి పాపకు ఇబ్బందట......ఆలోచిస్తే ఆమె చెప్పింది నిజమే ననిపిస్తుంది. మీరే రాగూడదూ! మిమ్మల్ని చూడాలనివుంది... వస్తారు గదూ!

ఇట్లు—మీదాసి
రాణి.

* * *

రాణికి— నెల్లూరు,
8-3-56.

నీ ఉత్తరం అందినది. నా ఆరోగ్యం సరిగా లేదు. ఆకలి తగ్గిపోయింది. యిల్లంతా అసహ్యంగా ఉంది. చివరకు స్నానం కూడా వేళకు చేయటం లేదు. నీవు త్వరగా రావలసింది. ప్రసవించి కూడా నెలైంది. కావాలంటే పనిమనిషిని పెట్టుకోవచ్చు. ఈ ఉత్తరం అందగానే మంచిరోజు చూసుకొని మీ తమ్ముడిని వెంటబెట్టుకొని రావలసినది. —నీమూర్తి.

* * *

ప్రియమైన శ్రీవారికి- మదరాసు,
నమస్కారములు. 18-3-56

బాబు పక్కలో దొర్లుతున్నాడు. చూస్తుంటే నా హృదయం ఆనందంతో నిండుతుంది. మీరు వెంటనే వచ్చి వెళ్ళవలసింది. మీ ఆరోగ్యం జాగ్రత్త... హోటలులో నే వేడినీళ్ళు ఏర్పాటు చేసుకోండి. యిల్లు చిమ్మటానికి ప్రక్క వెయ్యటానికి ఒక పిల్లవాడిని పెట్టుకోండి. ఆడవాళ్ళను మాత్రం పెట్టుకోకండేం... వస్తువులు ఒక్కటె కూడా దక్కవు. అబ్బాయికి పాలసీసాలు పంపుతారు కదూ!

మీ ఉత్తరంకొరకు నిరీక్షించే
మీ—రాణి.

* * *

ప్రియమైన రాణికి— నెల్లూరు,
22 3 56

నీవు చెప్పినట్లు పనిమనిషిని పెట్టుకున్నాను. యిప్పుడు కొంచెం కష్టం తగ్గింది. అయినా నీవు వెంటనే బయలుదేరి రావలసినది. —నీ మూర్తి.

* * *

శ్రీవారికి— మదరాసు,
27-3-56

ఇక్కడ బాబూ నేనూ క్షేమం. మీ క్షేమములు తెలియపర్చవలెను. మా అన్నయ్య మరదలు పెళ్లి 9 వ తేదీన జరుగుతుంది. మేమందరం వెళుతున్నాము. బీరువాలో మూడవ అరలో క్రింజన్ రంగు సిల్కుచీరె ఉంది...పంపండి మీరు కూడా వస్తే బాగుంటుంది. నేను రాలేనందుకు క్షమిస్తారు గదూ! —మీ రాణి.

* * *

ప్రియమైన రాణికి— నెల్లూరు,
2-4 56

నీవు కోరినరంగు నాకు తెలియలేదు. మన ప్రక్కింట్లో చేరిన పంతులమ్మ నడిగి తెలుసుకుని పంపుతున్నాను. నీవు పెండ్లి ప్రయాణము జాగ్రత్తగా చేయవలసింది నీవు ఎప్పుడు వచ్చేది తెలిపేది. —నీ మూర్తి.

* * *

ప్రియమైన శ్రీవారికి మదరాసు,
మీ దాసి నమస్కారములు. 8-4-56

మీరు జాగ్రతగా ఉండవలసినది తోడుగా ఎవరినయినా పడుకో బెట్టుకోండి. పంతులమ్మను యింటిలోనికి రానీయకండి. ఏమయినా ఎత్తుకపోవచ్చు. తాళాలు బాగా వెయ్యండి నే చెప్పినవన్నీ గుర్తుంచుకుంటారు గదూ... మీ దాసి.రాణి.

* * *

రాణికి— నెల్లూరు,
9-4-56

నా ఆరోగ్యం బాగానే వుంది. నీ ఆరో

భర్త:—నా క్లాస్ మేట్ శంకర్రావు నిన్న కనిపించాడు. వాడికి పెద్ద ఉద్యోగమైంది గదూ, అందుకని నాకంటె గొప్పవాణ్ణని గాబోలు, నేను పలకరించినా పలక్కుండా వెళ్లిపోయాడు.

భార్య:—ఏడిశాడు, వాడి మొహం. చవట, వెధవ, పెళ్ళాం చేతులో కీలుబొమ్మ. వాడు మీకంటే గొప్పవాడని ఎలా అనుకుంటాడు?




# ఉత్తరాల ఉదంతం

గ్యం జాగ్రత్త. ఇక్కడ నీవు లేని లోటు కనపడకుండా పంతులమ్మ సాయం చేస్తూంది. మొన్న నాకు జ్వరం వస్తే మందు కూడా యిచ్చింది. మీ అమ్మ ఇష్టప్రకారం వుండి రావలసింది. —నీ మూర్తి.

* * *

ప్రియమైన శ్రీవారి
పాద సన్నిధికి— మదరాసు,
11-4-56

మీ చరణదాసి నమస్కరించి వ్రాయునది. నా మనస్సేమీ బాగుండటం లేదు. మిమ్మల్ని విడిచి ఉండలేకపోతున్నాను. వద్దామంటే పదిరోజులదాకా మంచి రోజు లేదు... నా హృదయం ఎందుకో మిమ్మల్ని చూడాలని తహతహలాడుతోంది. మీరు రమ్మంటే వచ్చేస్తాను. మీ లేఖకై నిరీక్షించే మీ రాణి.

* * *

రాణికి— నెల్లూరు,
18-4-56

నేను పంతులమ్మ కలసి నీకు నచ్చే చీర తెచ్చాము పంపుతున్నాను. అందినట్లు వ్రాయవలసింది నీవు ఇప్పుడు రావద్దు
—నీ మూర్తి.

* * *

ప్రియమైన శ్రీవారి
పాద సన్నిధికి మదరాసు,
20 4 56

నేను బయలుదేరి వస్తున్నాను. 28-వ తేదీ రైలు దగ్గరకు రావలసినది. -మీ రాణి

* * *

రాణికి— నెల్లూరు,
22-4-56

నేను, కొందరూ, పంతులమ్మా 26 వ తేదీన హంపీకి పోతున్నాము. నేను వచ్చి ఉత్తరము వ్రాసినంతవరకూ రావద్దు. చిరంజీవికి ముద్దులు. -నీ మూర్తి.

* * *

25-4-56 వ తేదీన తమ్ముణ్ణి వెంట బెట్టుకుని వచ్చిన రాణి, 'ఏమండీ పంతులమ్మేది' అని అడిగింది 'పంతులమ్మా! ఆమె నిన్ననే యిల్లు ఖాళీ చేసి వెళ్ళింది' అని మూర్తి తడుముకోకుండా చెప్పేశాడు.

★